


# అల్పమానవులు

నిర్దిష్టమైన దినచర్య అంటూ లేకుండా తిరిగే టటువంటి నాకు ముఖ్యంగా వేసవికాలం సెలవురోజులు గడపటమంటే బహు ఇబ్బందిగా ఉంటుంది. ఎందుకనో సంవత్సరం పొడుగున ఉన్న ఇంట్లోనే వేసవికాలం కూడా గడపాలనేసరికి, నాకు ప్రాణం మీదికివచ్చింది. అందుకని సూర్యనారాయణగారి ఊళ్లో ఈ వేసవి కొన్నిరోజులు గడపాలనుకొని నా సరంజామా కొంత వేసుకొని బుఱ్ఱకసరత్తు పుస్తకాలు కూడా కొన్ని వెంటపెట్టుకొని వాళ్ళ ఊరు వెళ్లాను. సూర్యనారాయణ మాకు చాల దగ్గర బంధువు. నాకు అన్నయ్య వరస అవుతాడు.

నేను పోయేటప్పటికి మా అన్నయ్య బయట పంచపాళీలో కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు. నన్ను కొద్దిదూరంలోనే చూచి 'రారా! సకాలానికే వచ్చావు' అంటూ లోన ఉన్న భార్యని పిలిచాడు. ఆమె వస్తూనే,

'ఏంబాబూ! ఇప్పుడేనా రావటం? ఇప్పుడే అనుకుంటున్నాము నీ సంగతి. సెలవులు ఇచ్చి ఉంటారు, నిన్ను ఒక్కపర్యాయం రమ్మనమని కబురు చేయిద్దామని మీ అన్నయ్య అంటున్నార'ని అంది.

'ఏం! అంతపని వచ్చిపడ్డది నాతో!' అన్నాను.

'ఏమీ పనికాదు బాబు. అమ్మాయికి నాల్గో ఏడు వెళ్ళి అయిదో ఏడు వస్తోంది. దాని చదువు విషయం చూడవలె. దానికి ఇప్పటినుంచే ఇంగ్లీషుకూడా నేర్పించవలె' అన్నది.

అయిదేళ్ళకూడా నిండని పిల్లకి ఇంగ్లీషు అనంగానే నాకు నవ్వు వచ్చింది.

'అప్పుడే దానికి ఇంగ్లీషు గింగ్లీషు ఇవి అన్నీ దేనికి? చిన్నపిల్లని కష్టపెట్టటం కాకపోతే. అసలు దానికి మాటలువచ్చా' అని అడిగాను.

మా అన్నయ్య ఒక్కసారిగా అందుకున్నాడు.

'నేను అంటున్నదికూడా అదేరా! ఇంకా మూడునాల్గు ఏళ్ళదాక మీ వదినే తెలుగు చెప్పమంటున్నాను. దాని తరువాత సంగతి తరువాత చూచుకోవచ్చు' అన్నాడు.

'అది సరేనండి! ఇప్పటి సంగతి చూడండి. ఈ సంసారం చాకిరీతో పిల్లకు చదువు చెప్పినట్లే! అది మనదగ్గరే చదువుకోవటమంటే లాభంలేదు. దానికి చదువు అంటదు' అని అంటూ లోనికి వెళ్ళిపోయింది లోననుంచి వచ్చిన ఒక కేకకు సమాధానంగా.

'ఏం అన్నాయ్ ఎట్లా ఉన్నారు' అన్నాను.

'ఎట్లా ఉండేదేమున్నదిరా! ఏదో ఇంతవరకు బాగానే ఉన్నాం' అన్నాడు

మొవ్వ రాంబాబు

'ఏం బాగున్నారు? నువ్వేమో పూర్వం కన్నా చిక్కిపోయావు' అన్నాను.

ఆయన ఏమీ మాట్లాడలేదు. నారాయణ అన్నాయ్ చాలా మంచివాడు. నేనంటే ఆయనకు బహు ఇష్టం. ఆయన భార్యకుకూడా నేనంటే బహు అభిమానం. అదికూడా ఎందుకంటే మావాళ్ళలో నేను ఒక్కడినే కాలేజికి వెళ్ళి చదువుకున్నవాడిని. అందుకని మా వాళ్లు అప్పుడప్పుడూ మావాళ్ళు రాంబాబు గుంటూరుపోయి చదువుకుంటున్నాడని చెప్పుకుంటారు. అందుకనికూడా ఆమెకు నామీద అభిమానం కలిగి ఉండవచ్చు. ఇంకా అన్నింటికన్నా ఆమెకు నామీద అభిమానానికి కారణం ఆమెకూడా చదువుకున్నది. తెలుగులో ఉన్న అన్ని రకాలయిన నవలలు కావ్యాలు అన్నీ చదువుతుంది. పైగా ఇంగ్లీషు కూడా కొద్దిగా వచ్చు, ఇంగ్లీషు వచ్చు అంటే మనం అన్నం తింటూ సాల్టుగాని బట్టర్ మిల్కుగాని తెమ్మంటే అర్థం చేసుకుంటుంది. ఆమె ఈ సంస్కారానికి కారణం ఆమె పుట్టింటి వారి కుటుంబం. ఆమె అన్నదమ్ములు, పిన తండ్రి కొడుకులు వాళ్ళంతా చదువుకున్నవాళ్లు. ఆమె పెదతండ్రి కొడుకు ఒకతను కొన్నాళ్ళు మా కాలేజీలో పని చేసి గవర్నమెంటు సర్వీసులంకించుకొని అనంతపూర్ వెళ్ళాడు. అటువంటి విద్యాసంస్కార వాసన గల ఆమె, కొద్దిపాటి విద్యాధికులురాలు, మా వాళ్ళ యింటికి వచ్చింది నారాయణ అన్నాయ్‌కి భార్యగా. మా నారాయణ అన్నాయ్‌ది నానాకాలం చదువు. కూడబలుక్కొని పుస్తకం చదువుతాడు. పాపం అది అతని తప్పు కాదు. అది అంతా వాళ్ళ తండ్రిదే. ఊహ తెలిసినప్పటి నుంచీ పనిలో పడేసి క్షణం తీరిక లేకుండా చేశాడు. మొన్న ఈమధ్యనే నేర్చుకున్నాడు కొంచెం ఈ కాస్త చదువు అయినా నా పోరు మీద కొంత అడవాళ్లు చదవంగా లేనిది మనం ఎందుకు చదవలేమూ? అనే పట్టుదలతో కొంత. ఏది ఏమయినప్పటికీ అతనికి ఇంకోళ్ళకు చెప్పే పాటి చదువూ జ్ఞానం లేదని చెప్పగలను. మా వదిన చెప్పగలదు కాని ఆమెకు తీరిక లేదు.

'ఒంట్లో బాగుండలేదా?' అన్నాను.

'జ్వరం వస్తూన్నదిరా' అన్నాడు.

'మామూలు జ్వరంగా లేదు. కొంచెం జాగ్రత్తగా ఉండవలసింది' అన్నాను.

'జాగ్రత్త పడినట్టే ఉంది. రెండుమూడు రోజులు వస్తుంది పోతుంది. నాలుగైదురోజులు కొద్దిగా తెరగంగానే మళ్ళీ వస్తుంది. ఇది ఎట్లాగో ఏమిటో అర్థంకాకుండా ఉన్నది' అన్నాడు.

'ఎట్లాగో ఏమిటో ఏముంది? డాక్టరుగారికి చూపించటం లేదా? ఆయన ఏమీ చెప్పలేదా?' అనడిగాను.

'నాటు వైద్యుడికి చూపించాను. ఏమీ పర వాలేదంటాడుగాని నాకు నమ్మకం కుదరటం లేదు' అన్నాడు.

'అన్నాయ్! అటువంటప్పుడు మా ఊరు వచ్చి పెద్దడాక్టర్లకి ఎందుకు చూపించవు? ఈ విధంగా ఎన్నాళ్ళని గడిపివేస్తావు' అన్నాను.

'ఎట్లాగురా చూపించటం? చూపించగానే అక్కడ ఉండమంటే ఉండవలె. ఇక్కడ పని వదిలిపెట్టుకొని రావటానికి వీల్లేదు. మీకేం? పల్లపుటూళ్ళవాళ్లు. చేనుమీద విత్తనాలు ఇట్టా చల్లిస్తారు. రెండోరోజుకల్లా ధాన్యం ఇంటికి వస్తుంది కళ్లాల్లోంచి. మేము సంవత్సరం పొడుగూతా చచ్చేచాకిరీ చేయవలసి వస్తుంది. మరీ ముఖ్యంగా ఈ ఊళ్ళవాళ్ళం' అన్నాడు.

'అట్లా అంటే ఎట్లాగ? మన ఆరోగ్యం ముఖ్యమా పని ముఖ్యమా? సరే, నీకు నేను చెప్పేమాత్రం వాడినికాను.' అంటూ ఇంట్లోకి వెళ్ళాను.

మా నారాయణ అన్నాయికి మంచి ఆస్తి ఉన్నది. తండ్రి లేడు. ఉన్నది ఒక్క తమ్ముడు. వాడు నా యీడువాడు. వాడికీ పెళ్ళి అయిం పెళ్ళాం కాపురానికి వచ్చింది కాని ప్రౌఢక్షను మొదలుపెట్టలేదు. నారాయణ వాళ్ల తల్లి, అమ్మమ్మ ఇంకా చెక్కుచెదరకుండా ఉన్నారు. నన్ను చూడంగానే అంతా పరామర్శించారు. నారాయణ తమ్ముడు రాజారావు ఇంట్లో లేడు. వాడు ఎప్పుడూ ఉండడు ఇంట్లో. ఎప్పుడూ పొలంమీదగాని వ ములదొడ్డి దగ్గర గాని కొంచెం తీరిగ్గా ఉంటే చౌదరమ్మ గారి చావిట్లో చీట్లాటవద్ద గాని దొరుకు

తాడు. చీట్లాట ఎన్నడూ ఆడడుగాని చూడటంవరకే జరుగుతుంది. నారాయణ దాదాపు సంవత్సరంన్నరనుండి కొద్దిగా పనిలోనుంచి తప్పుకుంటున్న కొద్దీ రాజారావుకి పాపం విశ్రాంతి దొరకటంలేని మాట నిజం. వీడి భార్య సరిగ్గా మేనమామకూతురే. అందువలన కొంచెం తెమలని రోజుల్లో మేనమామగారే స్వయంగా వచ్చి పనులు చూచి పోతూంటాడు.

నారాయణవాళ్ళ ఈ మేనమామను చూస్తే నా కెందుకనో బలేకోపం వస్తుంది. అది ఎందుకనో నేను ఎవ్వరికీ విడమర్చి చెప్పలేను. ఆయన వినా నాతో ఎక్కువ చనువుగాగానీ నామీద కోపంగాగానీ ఉండడు. విశ్వనాథ సత్యనారాయణగారి 'మా బాబు' లో చదివాను. ఇట్లాగే ఒక మేనమామ వస్తాడు. వాడి మొఖము చూస్తుంటేనే కాల్చివేయు బుద్ధి పుడుతుంది అన్నట్లుగా వర్ణిస్తాడు హీరో తన అసహ్యాన్ని. అట్లాగే ఈ నారాయణవాళ్ళ మేనమామ వెంకట సుబ్బయ్యగారంటే నాకు అసహ్యం. మరి పోతే రాజారావుకి అసలు ఏ విషయాల్లో అంతుపట్టదు. ఎక్కడకయినా పని పూర్తి చేసుకొని రమ్మని వాళ్ళ అన్నయ్య అంటే తప్ప చేయడు. వెంకటసుబ్బయ్యగారు ఈ యింట్లో అధికారం చెలాయించాలని చూస్తుండేవాడు కాని నారాయణ అన్నాయ్ ఎప్పుడూ బెట్టుగా ఉండేవాడు. మరీ సంవత్సరంన్నరనుంచీ తీవ్రమైన సంఘర్షణ ఏర్పడ్డది ఇంట్లో. నేను అక్కడ ఉన్న కొద్దిరోజులకే గ్రహించాను ఇదంతా. నారాయణ అన్నాయ్ వచ్చే సీజన్‌కి రేగడ చేను మగతాకిద్దామంటాడు. ఎకరం మూడు వందలరూపాయల చొప్పున తీసుకుంటామంటున్నారు. రెండు తడవులు పొగాకు పండిన చేనుని మళ్ళాపొగాకుకి, అంతకుతీసుకోవటంబహుకష్టమయినపని. ఎందుకంటే మూడవతడవకూడాపొగాకు వేయాలంటే బోలెడంత ఎరువు వేయాలి. ఇది కాకుండా దొరపొగాకు పంటకుబోలెడంత శ్రమపడాలి. మనం స్వయంగా కాల్పించినా రంగు తేలకపోవచ్చు మూడవ పర్యాయం. ఇవి అన్నీ కూలంకషంగా ఆలోచించి తను జ్వరంలో ఉండి, తిరిగి పనులు చేయించలేడు కనుక తమ్ముడు ఒక్కడివల్ల అయ్యే పని కాదుకనుక మగతా తీసుకుంటామన్నవాళ్ళను పిలిపించి వ్రాయించబోయేటప్పటికి వెంకటసుబ్బయ్యగారు ఊడిపడ్డాడు వాళ్ళ ఊరినుంచి. మగతాకివ్వటానికి వీలు లేదన్నాడు. 'వాళ్ళకేంపిచ్చిపట్టితీసుకుంటున్నారురా లాభాలులేనిదే? మనం పని చేయించితే మనకు రావా ఆ లాభాలు?' అన్నాడు.

'సరే మీరు ఇక్కడే ఉండి చేయించుతారా?' అన్నాడు నారాయణ. ఆయన ఏమీ మాట్లాడలేదు.

'ఈ ఒక్క ఏటికి మగతాకిస్తే మనం పెద్దగా దండగపడేదేమీ ఉండదులెండి,' అంటూ నారాయణ 'కాగితలమీద సంతకాలు చేశాడు. వెంకటసుబ్బయ్యగారు కౌలు ఇంకొంచెం పెంచవలసిందని కోరాడుగాని ఆ మగతా తీసుకునే వాళ్లు 'ఇప్పటికే ఎక్కువ పలికామండి. ఇంక దమ్మిడీ దాటినా మునగాలిపోతుంది' అన్నారు.

నారాయణ ఏమీ మాట్లాడలేదు. వెంకటసుబ్బయ్యగారు అదోక విధమైన మొఖం పెట్టి తనలో తానేదో గొణుగుకున్నాడు.

ఎప్పుడుపోయినా దాదాపు నెల రోజులు పైగా ఉండేవాడిని. ఈ పర్యాయం ఎందుకనో నాకు ఉండబుద్ధిపుట్టలేదు. అందుకని పదిరోజులు కూడా కాకముందే ప్రయాణమయ్యాను మళ్ళా మా ఊరికి.

'ఇంకా రెండురోజులు ఉండు బాబూ' అంది వదిన. ఆమె మాటను ఎప్పుడూ తిరస్కరించలేదు. ఈ పర్యాయం తిరస్కరించి అయినా వెళ్ళిపోవాలని బుద్ధిపుట్టింది. చివరకు ఆ రెండురోజులూ ఉండి బయలుదేరాను. మా నారాయణ అన్నాయికి కూడా యిష్టంలేదు నేను వెళ్లటం అంత తొందరలో. మిగతావాళ్ల సంగతి నాకు తెలియదు.

* * *

వేసవి సెలవులు గడచిపోయినవి. నేను మళ్ళా కాలేజీకి వెళ్ళటం ప్రారంభించాను. నారాయణకి అప్పటికీ ఇప్పటికీ తీరలేదు పట్నం వచ్చి డాక్టరుకి చూపించటానికి. మరి ఎందుకు ఈవిధంగా త్రోసివేస్తున్నాడో నాకు అర్థము కాదు. నేను వెళ్ళి వచ్చినప్పటినుంచీఇంతవరకూ మనిషి తేరుకోలేదని విన్నాను. అప్పుడప్పుడూ జ్వరంవస్తునే ఉంటుందట. మరి విజ్ఞానవంతురా

లనిచెప్పుకోదగిన రాజ్యలక్ష్మి-అంటే మా వదిన-అయినా మరి నారాయణ అన్నాయ్‌ని ఎందుకు వత్తిడి చేయటంలేదో నాకు తెలియదు. అప్పుడప్పుడు హెచ్చరిస్తుండేదని మాత్రము నాకు తెలుసు.

నేను ఒకరోజున పని ఉండి గుంటూరునుంచి వస్తూ వాళ్ళ ఊరిలో దిగాను. నారాయణని చూచేటప్పటికి నాకే భయం వేసింది. మనిషి తెల్లపడిపోయాడు. సన్నపడిపోయాడు. మొఖములో కొన్నికొన్ని భాగాలలో వాచి వచ్చగా కనుపించసాగింది.

'నారాయణ అన్నాయ్! నీవు బ్రతుకవు ఇట్లా ఉంటే' అన్నాను.

'ఆ పోనీలేరా ! బ్రతక్కపోతే అప్పుడు చూచుకోవచ్చు' అన్నాడు. ఆరోజు రాత్రి నేను భోజనంచేసి వాళ్ళ ఇంట్లో బయట పంచపాళీలో పండుకొన్నాను. నారాయణ కూతురు అయిదేళ్ళ చిట్టిపిల్ల నా పక్కలోనే ఉంది. నేను తెచ్చిన పిప్పర్మెంటు తినిపిస్తున్నాను. ఇంతలో రాజ్యలక్ష్మి వచ్చి మంచం ప్రక్కనే నేలమీద కూర్చుంది.

'అయనకు నీవయినా చెప్పు బాబూ' అనగానే నేను ఉలిక్కిపడి ఆమె ఉన్నట్లు గుర్తించాను.

'ఏమి చెప్పమంటావు? అయనకు తెలియదా?' అన్నాను.

'అది కాదబ్బాయి అసలు సంగతి. సంవత్సరం రోజులనుంచీ నేను పట్టణం తీసుకువద్దామంటాను. కాని మా అత్తా వాళ్ళ అమ్మ పడనీయలేదు. వీళ్ళకు తోడు ఆ వెంకట సుబ్బయ్య ఒకడు. 'వీడికి రోగం నయం చేయించుకువస్తే వెయ్యిరూపాయలు అవుతవి. ఎక్కడనుంచి తెస్తావు వెయ్యిరూపాయలు. మన ఊరు శివయ్యగారికి పాతిక ఇస్తే నయం చేయడా' అని అన్నాడు. తల్లీ కూతుళ్ళ నిద్దరినీ చేరదీశాడు తనవైపుకు. భాగాలు పంచనిదే డబ్బు ఖర్చు పెట్టటానికి వీల్లేదని వెంకట సుబ్బయ్య అన్నాడట. మీ అన్నయ్య తనకు నయం కానిదే పంచడానికి వీలులేదన్నాడు. ఇట్లా ఉన్నది పంతం. అటుఇటూచేసి ఈయన ప్రాణానికి వచ్చింది' అని ఆమె అంటుంటే కళ్ళ వెంబడి నీళ్ళు బొటబొట కారినవి.

వెంకట సుబ్బయ్యగారు ముఖాముఖిగా ఏ మాటా నారాయణగారితో అనలేదు. అయన ఆ మాటలు తన చెల్లెలు తల్లిదగ్గర అంటున్నప్పుడు వదినకు చూచాయగా తెలిసినవి. ఆమె నారాయణగారికి నివేదించగనే అయన ఏం జరుగుతుందో చూద్దామని పట్టు పట్టుకొని కూర్చున్నాడు. నారాయణచేసిన మహా పాపమల్లా రాజ్యలక్ష్మిని పెండ్లి చేసుకోవటమే. అది అతని తల్లికి ముసలమ్మకు వెంకట సుబ్బయ్యకు ఇష్టం లేదు. అప్పట్లో నారాయణవాళ్ళ తండ్రి ఉన్నాడు గనుక అయన ఇష్టంమీద గౌరవనీయమైన కుటుంబంనుండి వచ్చిన సంబంధమని పెండ్లి జరిగింది. రాజారావుని తన స్వంత అల్లుడిగా చేసుకోవటంలో వెంకట సుబ్బయ్యగారికి మంచి స్థానబలిమి దొరికింది.

ఆ మరునటి రోజు ఉదయం గడిచింది. కొద్దిగా భోజనంచేసి నారాయణ అన్నాయ్ మధ్యాహ్నం నిద్దురపోయాడు. నిద్దురనుండి లేచేటప్పటికల్లా మొఖం ఉబ్బరింపు ఎక్కువగా కనుపించింది. సాయంత్రం చీకటి పడినప్పటికల్లా ఎగశ్వాస పుట్టుకువచ్చింది. రాత్రి దాదాపు పదిగంటలకల్లా ఎగశ్వాస తగ్గింది. మరునటి రోజు ప్రొద్దుటికి ఉబ్బరింపుకూడా తగ్గింది. ఐనా నాకు ఎందునో అనుమానంగానే ఉన్నది. ఆ రోజు రాత్రి రాజ్యలక్ష్మి నావద్ద ఏడ్చింది. చెడ్డావడ్డా కన్నకడుపు. ఆ విధంగా ఎగశ్వాస రావటం మొఖం వాయటం ఇది అంతా చూచేటప్పటికి తన కొడుకు ఎంతఆపదలో ఉన్నాడో గ్రహించగలిగింది రంగనాయకమ్మ, నారాయణ అమ్మ. ఇంత విషమించటానికి కారణం తనే నేమోనని ఆమె తత్తర పడింది. ఆమె ఎన్ని అనుకుందో తనలోతాను ఎన్ని తిట్టుకుందో గాని మరునటిరోజున ప్రొద్దునే నన్ను లేపి నారాయణని మా పట్టణం తీసుకువద్దాం రమ్మన్నది నేను మహాసంతోషంతో సరాసరి మా యింటికే తీసుకొనివచ్చాను. మరీ విషమించేటప్పటికి ఆమెకు తెలిసి వచ్చింది. ఇద్దరు ముగ్గురు డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్ళి చూపించాం. వాళ్ళకు వ్యాధి లక్షణాలు అంతుపట్టలేదు. ఇద్దరు డాక్టర్లు

ఎక్స్‌రే కూడా తీసి చూచారు. గుండె బాగానే ఉన్నది. చివరకు ఇంకొక గొప్ప డాక్టరుగారు పాండురోగమని తేల్చి చెప్పాడు. రక్తహీనత, ఎక్కువపని చేయుట కారణమని చెప్పి 'చాలా విషమించినాక తీసుకొచ్చారు' అన్నాడు. రాజ్యలక్ష్మి బిత్తరపోయింది. నారాయణ తల్లి నేలవంక చూచింది. డాక్టరుగారు నన్ను స్వయంగా వేరుగా పిలిచి 'ఆశ లేదండీ.' అన్నాడు. 'డాక్టరుగారు' అని నేను చెప్పబోతున్న దానిని సాంతం చెప్పనీయకుండానే 'లాభం లేదు. ఆలస్యం జరిగింది. ప్రయత్నిస్తాను.' అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు. నాకు ఏడుపు వచ్చిన పర్యంతం అయిందిగాని అక్కడ కూర్చుని ఏడవటానికి కూడా అవకాశం లేక పోయినందున అతికష్టంమీద ఆపుకుంటూ బయటకు వచ్చివేశాను.

డాక్టరు రక్తవృద్ధికి ఇంజక్షన్సు ఇచ్చినాడు. 'వారంరోజుల లోపున ఏమన్నా సుగుణం కనిపిస్తే బ్రతుకుతాడు లేకపోతే ఇంటికి తీసుకు పోవచ్చు'నన్నాడు. నారాయణ వాళ్ళ అమ్మ, అమ్మమ్మకూడా శక్తి వంచనలులేకుండా పాటుపడుతున్నారు. కాని ఏమిలాభం? చాలా ఆలస్యం జరిగిపోయింది. రంగనాయకమ్మ రోజుకు ముప్పయిమూడుసార్లు తనని తాను తిట్టుకుంటుంది ఇంత అశ్రద్ధ చేయించినందుకు. ముసలమ్మ ఏదో చేయించాలన్నది దేముడికి. కాని దేముడినోట్లో కరక్కాయపడింది. నాల్గోరోజు కల్లా ఎగశ్వాస ఎక్కువయి గుడ్లు తేలవేస్తున్నాడు. నేను డాక్టరు దగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళి తీసుకొచ్చాను. ఆయన చూచి చక్కా వెళ్ళిపోయాడు. మా యింటిల్లిపాది గుప్పుమని ఏడ్చారు. నారాయణ అన్నాయ్ నేను తీసుకొచ్చానన్న గౌరవం కూడా ఉంచకుండా తెల్లవారుజామున మూడింటికి శాశ్వతంగా కళ్లు మూశాడు.



'నాకేమి చెపుతావు భగవంతుడా?' అని ఏడ్చింది రాజ్యలక్ష్మి వదిన. 'నాకూ బ్రతకాలనే ఉందే' అన్నాడు నారాయణ అన్నాయ్ జీవితంలోకల్లా కడసారిగా.

జీవచ్ఛవమయిన కట్టెగా మాత్రం నారాయణ అన్నాయ్ తిరిగి తన స్వగ్రామం చేరుకున్నాడు.

ఒక ఇరవయి రోజులు గడచిన పిమ్మట నేను ఎందుకో చిన్న పనిమీద వాళ్ళ ఊరికి వెళ్ళాను. ఈ లోపుగా నాకు అనేక విషయాలు తెలిసినవి వాళ్ళను గురించి. పట్టణంలో ఉన్న మాయింటికి ఎప్పటికప్పుడు వార్తలు తెలుస్తూనే ఉంటవి. వాళ్ళ ఇంట్లో చాలవరకు ఏడుపులు తగ్గినవి. రాజ్యలక్ష్మి వదిన మాత్రం తనలో తాను కుమిలి కుమిలి ఏడుస్తుండేది.

'మొద్దో మ్రానో మీపిల్ల మీకు మిగిలింది. పోయింది మాపిల్లా దేవమ్మా' అని అన్నదట ముసలమ్మ.

ఆ మాటకు రాజ్యలక్ష్మి వాళ్ళ బంధువులకి కోపం వచ్చింది. ఆమాటవిన్న ఒకామె 'అవునా మరి పోయింది మా పిల్లాడే అనుకో. మొద్దో మాన్నో మీకే మిగిలింది' అన్నది. ముసలమ్మ ఇంక మాట్లాడలేదు.

ఒక అయిదారు రోజులనుంచి ఇంకొక రకమయిన గుసగుసలు బయలు దేరినవి.

'మీ అమ్మాయికి మళ్ళా పెళ్ళి చేస్తే పోయే దేముంది? పెద్ద ఈడుకూడా కాదుగదా' అని అడిగించారు పక్కయింటి ఆమెచేత రాజ్యలక్ష్మి వాళ్ళ బంధువులని.

ఈవిషయం విన్న రాజ్యలక్ష్మికి సంతోషించాలో ఏడవాలో అర్థం కాలేదు. రాజ్యలక్ష్మి మరల రెండవ పెండ్లి చేసుకుంటే నారాయణ అన్నాయ్ అర్థభాగం ఆస్తి ఆమెకు ఆమె బిడ్డకు చెందకుండా పోతుందని వాళ్ళఆశ. రాజ్యలక్ష్మి తల్లి, వాళ్ళ బంధువులలో ఒకతన్ని అడిగింది. రాజ్యలక్ష్మికి దానిబిడ్డకు ఆస్తి వస్తుందా రాదా అని. ఆబంధువు కోర్టులసర్దారు. కోర్టులవిషయంలో ఆయనకు తెలియని విషయాలుండవు. పెద్దపెద్ద ప్లీడర్లలాంటి వాళ్ళకు లిటికేషనులమీద సలహాలిస్తుంటాడు. ఆయన పంచుకున్నది అయిదు ఎకరాలే అయినా ఇప్పుడు ఇరవయ్యి ఎకరాలు చేశాడు.

'మీకా భయమేమి అక్కర్లేదు. రాజ్యలక్ష్మికి బిడ్డకు సగభాగం రావలసిందే. మీకు భయంగాఉంటే నాకు అప్పగించండి నేను చేసేస్తాను. బిడ్డకు గార్డియనుగా లక్ష్మిచేత రిజిస్టరు నోటీసు ఇప్పించామంటే ఎల్లుండి ఈపాటికల్లా రావద్దా!' అని ఆయన అన్నాడు.

మరి వెంకట సుబ్బయ్యగారు ఎట్లా పసి కట్టాడో ఆయన ఒక్కమారుగా ప్లేటుమార్చి ఇటువంటి చెడ్డతలంపులన్నీ తలపెట్టినందుకు ఇంట్లో ముసలమ్మమీద చెల్లెలుమీద ఎగిరినట్లు ఎగిరి 'ఛీ! ఛీ! ఇటువంటివి అనకూడదు. అసలు తలంచనే కూడదు లక్ష్మి మాత్రం ఎక్కడికి పోతుంది? దాని ఇల్లు, దాని బిడ్డ, దాని సంసారం' అని అన్నాడు. ఇది వెంకట సుబ్బయ్యగారే అనటం మళ్ళా వీళ్ళకి అనుమానం కలుగచేసింది. అయినా కూడా వాళ్లేమీ వ్యాఖ్యానించకుండా పెద్దదినము పూర్తి కాంగానే వెళ్ళిపోయారు.

నేను ఆ ఊరిలో పని పూర్తిచేసుకొని వెళ్ళిపోబోతుంటే రాజ్యలక్ష్మి వదిన నాకొరకు కబురంపించినట్లు ఒకపిల్లాడు వచ్చి చెప్పాడు. వాళ్ల ఇంట్లో మరీ ఏడుస్తుంటారని నేను వాళ్ళ ఇంటికి వెళ్ళలేదు.

ఆమె మొఖం చూడలేకపోయాను. ప్రియమైన రాజ్యలక్ష్మి వదినకు దుస్తుల్లో మార్పులు లేకుండా ఉండటానికి ఇరుపక్షాలవారు అంగీకరించారు. అందుకు నాకు సంతోషంవేసింది.

'చూచావా రాంబాబూ! నాయింట్లో నన్ను ఖైదు చేశారు మీవాళ్ళు. నా బిడ్డని, నన్నూ సర్వనాశనం చేయాలని చూస్తున్నారు. ఇంత నీచానికి ఒడికడతారని నేను ఎన్నడూ అనుకోలేదు. మీ వాళ్ళంతా ఒట్టి అల్పులు రాంబాబూ!' అని అంటూ నావంక చూసింది. నేను తలవంచుకొని నేలవంక చూసాను. అల్పులు అనేమాట అర్థం ఎంతవరకు తగులుతుందో గ్రహించగలిగాను. నేను చిట్టిపిల్లను ముద్దుపెట్టుకొని ఆపిల్ల ముఖమువంక చూసేటప్పటికి నాకు దుఃఖం వచ్చింది. అయిదేళ్ళు కూడా సరిగ్గా రాని ఆ చిన్నపిల్ల ఆయింట్లో రాజకీయా

లకు మూలమయిందనుకొని దుఃఖాన్ని దిగమ్రింగుతూ బయటకు వచ్చారు.

ఈ కథ అంతా నేను ఎందుకు వ్రాయవలసి వచ్చిందంటే నారాయణ అన్నాయ్ చనిపోయిన రెండు నెలలు కాకముందే రాజ్యలక్ష్మి వదిన కన్న పుట్టింటికి వెళ్ళిపోయింది బిడ్డను ఇక్కడే వదిలి. బిడ్డను వదిలి వెళ్ళిందనగానే నా మనస్సు చివుక్కుమన్నది కాని కారణమేమిటో నాకు తెలియదు. తెలిసినా చేసేది ఏమీ లేదు.

ఈ గాథను వ్రాయకముందు ఈ విషయాలన్నీ నా స్నేహితుడు ఒకడికి చెప్పాను. అతను ఇప్పుడిప్పుడే సెక్సు సాహిత్యం చదివి తను కూడా రచనలు సాగించబోయే మహోద్యమంలో ఉన్నాడు. వాడు సినికల్‌గా మాట్లాడుతాడని నేను వాడి మాటకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వను. వాడు ఇది అంతా కూలంకషంగా విని, దీనిలో చెప్పేదేముందిరా! ఏదో ఆడప్రాణం రెపరెపలాడి ఉంటుంది. అందుకని ఏదో దారి చూసుకుని ఉంటుంది' అన్నాడు.

'ఛీ దౌర్భాగ్యుడా!' అన్నాను. వాడు అంతకన్నా తిట్టని లెక్కచేయడు. నాడిలా 'ఛీ దౌర్భాగ్యుడా' అని ఎందుకు నిర్హేతుకంగా అన్నానా అని విచారించుతున్నాను కొన్ని రోజుల తర్వాత జరిగిన దానివల్ల.

# జానపద చిత్రాల దుర్వినియోగం

దక్షిణ దేశంలో చెలరేగిన జానపద చిత్రాల వేలంవెర్రిని గురించి అనేకమంది అనేక విధాల వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం వెలువడే జానపద చిత్రాల నమూనాలు చూసి చాలామంది వాటిని మొత్తంగా ఖండిస్తున్నారు. కేవలం పరిశ్రమ దృష్టితో—అవి ప్రజాదరణ హెచ్చుగా పొందుతున్నాయి గనక—వాటిని పూర్తిగా బలపరుస్తున్నారు. మంచి చిత్రమైనట్టయితే, సర్వాంగశోభితమైన చిత్రమైతే, జానపదచిత్రం ఏ ఇతరచిత్రానికీ తీసిపోదని మరి కొందరు భావిస్తున్నారు. జానపద చిత్రంలో గల ప్రత్యేకత ఏమిటో, కళాస్వరూపంగా దాని విశిష్టత ఎటువంటిదో చాలామంది గ్రహించటానికి ప్రయత్నించటంలేదు. ఇందువల్ల కాలక్రమాన నష్టపడేది చిత్రనిర్మాతలేగాని మరెవరూ కారు. అందుచేత జానపద చిత్రాలలోఉండే ప్రత్యేకమైన పటుత్వాన్ని ఇతరులకంటె కూడా చిత్రనిర్మాతలే బాగా అవగాహన చేసుకోవలసి ఉన్నది.

అయితే ఈనాడు మనకున్న చిత్రనిర్మాతలలో గొర్రెదాటు మనస్తత్వమూ, సినిమా చిత్రాల నిర్మాణం లాటరీ అన్న మనస్తత్వమూ కనిపించినంతగా ముందు వెనుకలు ఆలోచించే శక్తి చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తుంది. ఆ శక్తికలవాళ్లు తమకేది మంచిదో తామే తెలుసుకుంటారుగాని ఇతరులచేత చెప్పించుకోరు. ఆశక్తి చాలనివారు తమ మనస్తత్వాన్ని మార్చుకోకపోతే చాలా పెద్దదెబ్బ తింటారు.

ఏ జానపద చిత్రానికైనా డబ్బు వస్తుందనే భ్రమను అనుభవంలేని చిత్రనిర్మాతలు విసర్జించాలి. (మరి కొన్ని జానపద చిత్రాలు దివాలా తీసేదాకా ఈ విషయం సర్వత్రా గుర్తించబడేటట్టు కనపడదు.)

ఇదివరలో డబ్బుచేసిన జానపద చిత్రాల్లో నటించినవారందర్నీ మార్చి ఎవరు జానపద చిత్రం తీసినా డబ్బు వస్తుందనేదికూడా కేవలం భ్రమే. ఇదికూడా కళ్ళఎదట రుజువవుతున్న విషయమే.

జానపద చిత్రానికి ఎవరుపడితే వాళ్లు కథ రాయవచ్చునన్న భ్రమ కూడా ప్రొడ్యూసర్లు పోగొట్టుకోవాలి. జానపద కథల్లో మంచి చెడూ ఉండదనే అపోహకంటె ప్రమాదకరమైన అపోహ మరొకటి ఉండబోదు. కథారచన చాతనయినవాడు మంచి సాంఘిక కథను రాసినదానికంటె చాలా తేలికగా జానపదకథను రాయవచ్చు. అంతమాత్రానికి జానపద కథను